రెవెన్యూ ఎన్‌ఓసీ లేకుండా జీహెచ్‌ఎంసీ అనుమతులు

- ఎవరి ప్రమేయం ఉందనే కోణంలో దర్యాప్తు
- అనుమతులు రద్దు చేయాలని లేఖ రాసిన తహసీల్దార్

బంజారాహిల్స్, మే 13 (ఆంధ్రజ్యోతి): నాలా స్థలాన్ని ఆనుకొని ఉన్న స్థలం జరుగుతున్న నిర్మాణ వివాదంలో రోజుకో కొత్త కోణం వెలుగులోకి వస్తుంది. నిన్నటి వరకు బఫర్ జోన్ పోను మిగిలింది ప్రైవేట్ స్థలం అయి ఉంటుందని అందరూ భావించారు. కానీ, సర్వే నిర్వహించగా అది ప్రభుత్వ స్థలమని తేలింది. ఇప్పుడు అసలు నిర్మాణాలకు జీహెచ్‌ఎంసీ అనుమతులు ఎలా ఇచ్చింది అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి ప్రాంతాల్లో రెవెన్యూ శాఖ నుంచి ఎన్‌ఓసీ తప్పనిసరిగా ఉండాలి. అప్పుడు జీహెచ్‌ఎంసీ అనుమతులు ఇవ్వాలి. కానీ, సదరు స్థలం విషయంలో అనుమతులు ఎలా వచ్చాయనే దానిపై ఇటు రెవెన్యూ అటు జీహెచ్‌ఎంసీలో చర్చలు జరుగుతున్నాయి. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.11 అంబేడ్కర్‌నగర్‌లో నాలా పక్కనే ఉన్న స్థలంలో నిర్మాణాల నిమిత్తం ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని కోరుతూ ఇప్పటికే రెవెన్యూ అధికారులు లేఖ రాశారు.

అసలు విషయం ఇది..

బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.11 అంబేడ్కర్‌నగర్ బస్తీకి నాలా ఆనుకొని ప్రభుత్వ స్థలం ఉంది. అనేకమంది ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడమే కాకుండా జీవో 58,59 కింద క్రమబద్ధీకరించాలని దరఖాస్తు చేసుకున్నారు. అయితే, ఈ ఇళ్ల నిర్మాణాలు నాలా బఫర్ జోన్ కిందకు వస్తాయని రెవెన్యూ అధికారులు దరఖాస్తులను తిరస్కరించారు. నిర్మాణాలు పోను ఖాళీగా ఉన్న స్థలాల్లో ప్రభుత్వ సూచిక బోర్డు కూడా ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా, నాలాకు సమీపంలో ఉన్న ఖాళీ స్థలం తమదేనంటూ కొంతమంది చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు ఈనెల 11న ప్రయత్నాలు ఆరంభించారు. బఫర్‌జోన్‌లో నిర్మాణాలేంటి అని స్థానికులు ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్ తన సిబ్బందితో అక్కడకు చేరుకొని నిర్మాణాలు బఫర్ జోన్ పరిధిలోకి వస్తాయని ప్రాథమిక అంచనాకు వచ్చారు. వెంటనే నిర్మాణాలు ఆపాలని సూచించారు. కానీ, నిర్మాణం చేస్తున్న వారు వినిపించుకోలేదు. జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులు తలదూర్చవద్దని, తమకు కోర్టు ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. అంతేగాకుండా జీహెచ్‌ఎంసీ అనుమతులు ఉన్నట్టు చెప్పారు. కానీ రెవెన్యూ సిబ్బంది వినిపించుకోలేదు. బఫర్ జోన్ ఎంత వరకు వస్తుందో చూడాలన్నారు. ఈ విషయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగింది. కొంత ఉద్రిక్తత నెలకొనడంతో బంజారాహిల్స్ పోలీసులు రంగంలోకి దిగి బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరకు బఫర్‌జోన్ ఉందా? లేదా? అనేది సోమవారం సర్వే నిర్వహించి తేల్చే వరకూ ఎటువంటి పనులు చేయవద్దని పోలీసులు చెప్పారు. పనులు ఆపించారు. మరుసటి రోజు ఆదివారం నిర్మాణదారుడు స్థలం చుట్టూ రేకులతో ప్రహరీ పూర్తి చేయడంతో ప్రైవేట్ స్థలమని బోర్డు పాతాడు. సోమవారం రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకొని సర్వే నిర్వహించేందుకు ప్రయత్నించగా నిర్మాణదారుడి మనుషులు అడ్డుకున్నారు. కొద్దిసేపటికి సర్వే నిర్వహించిన అనంతరం అది ప్రభుత్వ స్థలమని తేలింది. ఎక్కడో ఉన్న స్థలం ఇదేనంటూ నిర్మాణదారులు వాదిస్తున్నట్టు తేలింది.



బ్లూషీట్‌తో ఏర్పాటు చేసిన ప్రహరీ

ఇంటి నెంబర్ ఇక్కడిది.. సర్వే పక్క వీధిది

నిర్మాణదారుడి అనుమతిని చూడగా బస్తీలో ఉన్న ఓ పాత ఇంటికి ఉన్న నెంబర్ ఆధారంగా జారీ అయింది. అందులో పేర్కొన్న సర్వే నెంబర్ మాత్రం అక్కడికి దగ్గరలోని మరో ప్రాంతానిదని తేలింది. దీంతో ప్రస్తుతం సరిహద్దు నిర్మాణం జరిగిన ప్రాంతం ప్రభుత్వ స్థలమని రెవెన్యూ అధికారులు ప్రకటించారు. వెంటనే అనుమతులు రద్దు చేయాలని కోరుతూ షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి జీహెచ్‌ఎంసీకి లేఖ రాశారు. మరోవైపు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దృష్టికి ఈ విషయం వెళ్లడంతో ఆమె కూడా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ ఎన్‌ఓసీ లేకుండా అనుమతులు ఎలా జారీ అయ్యాయి అనే దానిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఆమె ఆదేశించారు. అంతేగాకుండా కోర్టులో ఉన్న ఆర్డర్‌ను కూడా రద్దు చేయించేలా కౌంటర్ దాఖలు చేయాలని సూచించారు.





ఐశ్వర్య కీర్తిసింగ్ | సాయి రిత్విక్ | వెంకట లోహిత్

సిస్టర్ నివేదిత పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత

అమీర్‌పేట, మే 13 (ఆంధ్రజ్యోతి): సిస్టర్ నివేదిత పాఠశాలలో 10వ తరగతి, 12వ తరగతులకు సంబంధించి 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ హరిహరప్రసాద్ తెలిపారు. సిస్టర్ నివేదిత పాఠశాల 10వ తరగతిలో ఐశ్వర్య కీర్తిసింగ్(589/600), సాయి రిత్విక్(587/600), వెంకట లోహిత్(585/600), 12వ తరగతిలో సాయి అనిరుధ్(బీఎస్‌ఈఏ) 487/500, అనీష్ బెహరా(ఎంపీసీ) 479/500, శివం బెనర్జీ(ఎంపీబీసీ) 438/500, ఎస్.కె.సౌమ్య(బైపీసీ) 430/500, కుషీ జైన్ 429/500 మార్కులు సాధించారు.

'మధురానగర్‌కాలనీలో ఆక్రమణలను తొలగిస్తాం'

పంజాగుట్ట, మే 13 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ కాలనీలోని ఫుట్‌పాత్, రహదారి ఆక్రమణలను తొలగిస్తామని జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ ప్రసీద తెలిపారు. మంగళవారం ఆమె సంక్షేమ సమితి ఉపాధ్యక్షుడు మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బందితో కలిసి కాలనీలో పర్యటించారు.

కన్నతల్లిపై కుమారుడు దాడి

బేగంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన కుమారుడు కన్న తల్లిపై రాడ్డుతో దాడి చేసి గాయపరచాడు. ఈ సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతినగర్‌లోని హరినగర్‌లో నివసిస్తున్న నర్సింహులు, కమలమ్మ దంపతులకు రాము, లక్ష్మణ్ కుమారులు ఉన్నారు. కమలమ్మ హౌస్‌కీపింగ్ పనులు చేస్తుంది. మద్యానికి బానిసైన పెద్ద కుమారుడు రాము తరచూ డబ్బులు ఇవ్వమని తల్లిని వేధించేవాడు. ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు కమలమ్మ ఇంట్లో ఉండగా రాము అక్కడికి వచ్చి తల్లితో గొడవపడ్డాడు. డబ్బులు ఇవ్వాలని వాగ్వాదానికి దిగాడు. ఆవేశంలో రాడ్డుతో తల్లిపై దాడి చేశాడు. అడ్డుకోవడానికి వచ్చిన లక్ష్మణ్‌పై కూడా దాడి చేశాడు. దీంతో కమలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ రసీదులతో భక్తులకు శఠగోపం

- హరేకృష్ణ మూవ్‌మెంట్ మాజీ ఉద్యోగులపై కేసు

బంజారాహిల్స్, మే 13 (ఆంధ్రజ్యోతి): హరే కృష్ణమూవ్‌మెంట్ ప్రతినిధులమని చెప్పుకుంటూ భక్తులకు నకిలీ రసీదులు ఇచ్చి శఠగోపం పెడుతున్న మాజీ ఉద్యోగులపై కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లోని హరే కృష్ణమూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నడిచే స్వర్ణ ఆలయంలో రాజుసింగ్, ఠాకూర్ అజయ్ మరికొంతమంది కొంతకాలం పనిచేశారు. వారి పనితీరు బాలేకపోవడంతో విధుల నుంచి తప్పించారు. కానీ రాజుసింగ్, ఠాకూర్ అజయ్ మరికొంత మంది నకిలీ రసీదులు సృష్టించి భక్తులను మోసం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న హరే కృష్ణమూవ్‌మెంట్ ప్రతినిధి కె.సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహితకు ప్రేమపేరుతో వేధింపులు

యూసు‌ఫ్‌గూడ, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమపేరుతో వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉండే ఓ ఇల్లాలు కొల్లి క్రాంతి కుమార్ కుమారుడికి ట్యూషన్ చెప్పేది. కొంతకాలం తర్వాత కొడుకుని ట్యూషన్ మానిపించి సదరు మహిళకు ఆస్పత్రిలో ఫిజియోథెరపిస్ట్‌గా పని కల్పించాడు. ఆ మహిళ భర్త దుబాయిలో ఉంటాడు. క్రాంతికుమార్ ప్రేమ పేరుతో వేధిస్తుండడంతో సదరు మహిళ మంగళవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

క్యాబ్ ఎక్కుతుండగా సెల్‌ఫోన్ అపహరణ

అమీర్‌పేట, మే 13 (ఆంధ్రజ్యోతి): క్యాబ్ ఎక్కుతున్న వ్యక్తి సెల్‌ఫోన్‌ను వెనకాలే వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయాడు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన అర్లగడ్డ రాజశేఖర్(52) మేస్త్రీ. కూతురుతో కలిసి ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు సోమవారం సాయంత్రం బల్కంపేటలోని ఆలయానికి వచ్చారు. అమ్మవారి ఫొటో కొనుగోలు చేసిన అనంతరం కూతురుని పిలిచిన రాజశేఖర్ ఇంటికి వెళ్లేందుకు క్యాబ్ బుక్ చేయమని కోరాడు. బుక్ చేసిన కొద్దిసేపటికే క్యాబ్ రావడంతో అందులోకి ఎక్కుతున్న రాజశేఖర్ వెనుకాలే వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి అతడి చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కుని పరారయ్యాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పులు.. వ్యక్తి అదృశ్యం

అమీర్‌పేట, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల పాలైన వ్యక్తి కనిపించకుండా పోయాడు. ఈ సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రాజురాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లికి చెందిన ఎం.నవీన్(34) ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కోసం తెలిసిన వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. అప్పులిచ్చిన వారి వేధింపులు అధికం కావడంతో ఫిబ్రవరి నుంచి ఘట్‌కేసర్ మండలం సింగారం గ్రామంలో ఉంటున్న బావమరిది రాఘవులు వద్ద ఉంటున్నాడు. నాగోల్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తూ అమీర్‌పేటలోని ఏఎస్‌రెడ్డి స్పోకెన్ ఇంగ్లిష్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నాడు. 11వ తేదీన ఎప్పటిలాగే అమీర్‌పేటకు వచ్చిన నవీన్ కనిపించకుండా పోయాడు. తన ద్విచక్ర వాహనాన్ని స్పోకెన్ ఇంగ్లిష్ సెంటర్ ముందు పార్కు చేశానని, తాను వెళ్లిపోతున్నానని బావమరిదికి మెయిల్ పెట్టాడు. రాఘవులు అమీర్‌పేటలోని స్పోకెన్ ఇంగ్లిష్ సెంటర్‌కు వచ్చి ఆరా తీయగా తమకేమీ తెలియదని చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జూబ్లీహిల్స్‌లో కార్వాన్ ఆర్‌టీఏ కార్యాలయం వద్దు

- ఎమ్మెల్యే దానంకు కార్పొరేటర్ వినతి



దానంకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

బంజారాహిల్స్, మే 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.46 పద్మాలయ అంబేడ్కర్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని కార్వాన్ నియోజకవర్గం ఆర్‌టీఏ కార్యాలయానికి కేటాయించవద్దని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ స్థలాన్ని కార్వాన్ ఆర్‌టీఏ కార్యాలయానికి కేటాయించడం అన్యాయమన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని రద్దు చేయించి నియోజకవర్గ ప్రజల అవసరాల కోసం ఆ స్థలాన్ని ఉపయోగించాలని డిమాండ్ చేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫోన్ చేశారు. కనీసం స్థానిక ఎమ్మెల్యేకు చెప్పకుండా ఎలా కేటాయించారని అడిగారు. మంత్రి కూడా తనకు ఈ విషయం తెలియదని సంబంధిత అధికారులను పిలిచి తెలుసుకుంటానని చెప్పారు. అనంతరం దానం నాగేందర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ స్థలాలను పరిరక్షించడంతోపాటు అవి స్థానిక ప్రజల అవసరాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సనత్‌నగర్‌లో టీడీపీకి పూర్వవైభవం

బేగంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన అన్నారు. టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి సతీష్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం తులసీనగర్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అన్ని డివిజన్లకు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారు. సనత్‌నగర్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మల్లేష్, బి.శ్రీనివాసులు, అమీర్‌పేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.కృష్ణ, ఎం.అరుణ్, బేగంపేట అధ్యక్షుడిగా రవిబాబు, రాంగోపాల్‌పేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.రామ్మోహన్‌నాయుడు, బి.సురేష్, బన్సీలాల్‌పేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.సందీప్, కె.చంద్రకళను ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ పరిశీలకులు నల్లెల కిశోర్, శ్యామ్, నాయకులు జయశ్రీ, రాజేంద్రప్రసాద్, ఎం.రాజు, యాదగిరి, మహేందర్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించిన నటుడు

బంజారాహిల్స్, మే 13 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు బెల్లంకొండ శ్రీనివాస్ రాంగ్ రూటులో కారు నడపడమే కాకుండా అడ్డగించిన ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించాడు. తోటి వాహనదారులు ప్రశ్నించేందుకు ప్రయత్నించగా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మంగళవారం ప్రశాసన్‌నగర్ నుంచి ఫిలింనగర్ వైపు వెళ్లేందుకు బెల్లంకొండ సురేష్ జర్నలిస్టు కాలనీ చౌరస్తాకు వచ్చాడు. అక్కడ సిగ్నల్ కోసం కార్లు ఆగి ఉండడాన్ని గమనించి రాంగ్ రూటులో పోనిచ్చాడు. అక్కడే ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ అడ్డగించాడు. శ్రీనివాస్ అతడి పైకి కారును దూకించాడు. మిగతా ప్రయాణికులు అతడిని నిలదీసేందుకు ప్రయత్నించగా కారు వెనక్కి తీసుకొని వెళ్లిపోయాడు. కారు టీఆర్ నెంబర్‌తో ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంలో ఎలాంటి ఫిర్యాదులు అందలేదని జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు.

గణేశ్ టెంపుల్ చౌరస్తాలో.. సివరేజీ మ్యాన్‌హోల్ ధ్వంసం

- రోడ్డుపైకి మురుగునీరు
- అధికారులకు ఫిర్యాదు
- వెంటనే మ్యాన్‌హోల్ నిర్మాణం



డ్రైనేజీ మ్యాన్‌హోల్ పనులు చేయిస్తున్న అధికారులు

బేగంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని శ్యామ్‌లాల్ బిల్డింగ్ పరిధి గణేశ్ టెంపుల్ చౌరస్తాలో కొంతకాలంగా నిత్యం సివరేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో నిత్యం వాహనదారులు తీవ్ర అవస్థలు పడేవారు. ఇక్కడ ఉన్న మ్యాన్‌హోళ్లలో ఒకటి పూర్తిగా ధ్వంసమవడంతో ఎగువ నుంచి వచ్చే మురుగునీరు ఇక్కడ రహదారిపై నిలుస్తోంది. స్థానికంగా నెలకొన్న సమస్యను ప్రజలు ప్రకాశ్‌నగర్ వాటర్‌వర్క్స్ సెక్షన్ మేనేజర్ రామేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం తన సిబ్బందితో అక్కడకు చేరుకుని మ్యాన్‌హోల్ పనులను నిర్వహించారు. పూర్తిగా ధ్వంసమైన మ్యాన్‌హోల్ స్థానంలో నూతన మ్యాన్‌హోల్‌ను నిర్మించారు. ఈ పనులను మేనేజర్ రామేశ్వరరావు దగ్గర ఉండి పూర్తి చేయించారు. దీంతో గణేశ్ టెంపుల్ చౌరస్తాలో ఏర్పడిన మురుగు సమస్యకు తెరపడింది.

పీవీఆర్ మల్టీప్లెక్స్‌లలో మహిళా కార్మికులపై వేధింపులు ఆపాలి



పీవీఆర్ ఐనాక్స్ మల్టీప్లెక్స్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు.

పంజాగుట్ట, మే 13 (ఆంధ్రజ్యోతి): పీవీఆర్ మల్టీప్లెక్స్‌లలో పని చేసే మహిళా కార్మికులపై వేధింపులను ఆపాలని, హెచ్‌ఆర్ విభాగం సిబ్బంది, అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ సినిమా థియేటర్స్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) డిమాండ్ చేసింది. యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం పంజాగుట్ట చౌరస్తాలోని పీవీఆర్ ఐనాక్స్ సినిమాస్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పీవీఆర్ సినిమా థియేటర్లలో పనిచేసే మహిళా కార్మికుల పట్ల యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరంగా ఉందని, మహిళా సిబ్బంది వాష్‌రూమ్‌కు వెళ్లాలంటే ‘‘ఖుగ్గిరి అనుమతి తీసుకోవాల్సిన దుస్థితి ఉందని నెలకొందన్నారు. మహిళా కార్మికుల సమస్యలను హెచ్‌ఆర్ దృష్టికి తీసుకెళ్లాలన్నా వారు సమయం ఇవ్వరని, వారంలో ఒక్కసారి మాత్రమే కలవాలని నిబంధనలు పెడుతున్నారని ఆరోపించారు. ప్రతీ రోజు ఉదయం విధులకు వచ్చిన కార్మికులు మధ్యాహ్నం మూడు గంటలకే భోజనం చేయాలి అనే నిబంధన పెడుతున్నారని ఆరోపించారు. కార్మికులు ఎవరైనా అనారోగ్యం రీత్యా సెలవు పెట్టి మళ్లీ డ్యూటీకి వెళ్తే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకురమ్మంటున్నారని, లేదంటే విధులకు రావద్దని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా కార్మికులు వేధింపులు తట్టుకోలేక పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. కూకట్‌పల్లి ప్రాంతంలో ఒక కార్మికుడు పనిచేస్తూ చనిపోతే బాధ్యత తీసుకోవాల్సిన యాజమాన్యం పోస్టుమార్టం లేకుండా చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులను పిలిచి నష్టపరిహారం ఇస్తామని చెప్పి కేసు పెట్టకుండా అడ్డుకొని చివరికి నష్టపరిహారం ఇవ్వకుండా మోసం చేసిందని ఆరోపించారు. పీవీఆర్ ముందు ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులను పోలీసులు అడ్డుకుని ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారన్న, పి.పుల్లారావు, కార్యదర్శి అరుణ్, రాష్ట్ర నాయకులు కమలాకర్, రామస్వామి, సుధాకర్, రాజు, భరత్, చలం, ఐ.రాజశేఖర్, నర్సయ్య, అశోక్, హారతి పటేల్, దుర్గ తదితరులు పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న నాయకులను సీఐటీయూ నాయకులు పరామర్శించారు.

ఫిర్యాదు ఏదైనా కేసు నమోదు

- నేరుగా ఫిర్యాదుదారుడికే ఎఫ్ఐఆర్ కాపీ
- సకాలంలో విచారణ చేసి కోర్టులో చార్జిషీట్
- నిబంధనలను పక్కాగా అమలు చేస్తున్న పశ్చిమ మండలం పోలీసులు

బంజారాహిల్స్, మే 13 (ఆంధ్రజ్యోతి): "...బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.1లో వేగంగా వచ్చిన కారు ఓ ద్విచక్ర వాహనదారుడిని ఢీ కొట్టింది. గాయపడ్డ వాహనదారుడిని స్థానికులు 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రాథమిక ఆధారాలు సేకరించి కేసు నమోదు చేశారు. నిందితుడిని గుర్తించారు. మూడు రోజుల తర్వాత కోలుకుంటున్న బాధితుడికి పోలీసులు స్వయంగా ఎఫ్ఐఆర్ కాపీ అందజేశారు."

"జూబ్లీహిల్స్‌లోని ఓ స్థలంపై వివాదం నెలకొంది. ఈ వ్యవహారంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. మాటామాట పెరిగింది. కొట్టుకునే వరకు వెళ్లారు. చివరికి ఓ పెద్ద మనిషి మధ్యవర్తిత్వంతో పరిష్కారమైంది. అప్పటికే వారి వ్యవహారం వల్ల స్థానికంగా శాంతిభద్రతల విషయంలో ఇబ్బందులు తలెత్తాయి. పోలీసులు వివరాలు సేకరించి సుమోటో కింద కేసు నమోదు చేసి గొడవపడ్డ వారికి నోటీసులు జారీ చేశారు."

ఏదైనా వివాదంపై ఠాణాలో ఫిర్యాదు చేయాలంటే చాలామంది అనేక రకాలుగా ఆలోచిస్తారు. ఫిర్యాదు చేసినా, పోలీసులు కేసు నమోదు చేయరనే అపనమ్మకమూ ఉంటుంది. నమోదు చేసినా కేసు గురించి పట్టించుకోరని భావిస్తుంటారు. ఈ క్రమంలో పశ్చిమ మండల పోలీసులు చట్టంలో ఉన్న నిబంధనలు పక్కాగా అమలు చేస్తున్నారు. నేరుగా ఫిర్యాదుదారుడి చేతికే ఎఫ్ఐఆర్(ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు) పత్రాలు ఇస్తున్నారు. ఫిర్యాదుదారుడికి న్యాయం జరిగేలా అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. ముఖ్యంగా పశ్చిమ మండలంలో పోలీసుల నిబంధనలను పాటిస్తూ సత్వర ఎఫ్ఐఆర్‌లు జారీ చేస్తున్నారు.

నమ్మకం పెంచేలా..

బంజారాహిల్స్‌లోని సినీమాక్స్ ఎదుట మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదం జరిగింది. దీనిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎస్సై ఆధ్వర్యంలో సిబ్బంది ప్రమాద స్థలానికి వెళ్లి పరిశీలించారు. అదే సమయంలో ఫిర్యాదుదారుడు ఎస్సైకి ఫోన్ చేయడంతో సంఘటన స్థలంలో ఉన్నట్టు తెలిపారు. అక్కడి వివరాలను సేకరించిన పోలీసులు కేఎం రాఘవేంద్ర సూచన మేరకు ఎఫ్ఐఆర్ పత్రాలను ఫిర్యాదుదారుడికి అందజేయడంతో ఆయన ఆశ్చర్యపోయారు. దర్యాప్తు చేస్తున్న తీరుతో ఫిర్యాదుదారు సంతృప్తి వ్యక్తం చేసి, తన నమ్మకాన్ని పెంచుకున్నారు. ఈ ఒక్క కేసులోనే కాదు.. పశ్చిమ మండలంలోని అన్ని ఠాణాల్లోనూ ఇప్పుడు ఫిర్యాదుదారులకు ఎఫ్ఐఆర్ పత్రాలను అందజేస్తున్నారు.

కొన్ని సందర్భాల్లో..

కొన్ని సందర్భాల్లో ఫిర్యాదు చేసిన తర్వాత దానిని పరిశీలించి కంప్యూటర్‌లో నమోదు, ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు దాదాపు గంట సమయం పడుతుంది. ఈ క్రమంలోనే చాలామంది ఫిర్యాదుదారులు తమకు సంబంధించి రసీదును తీసుకొని వెళ్లిపోతారు. అనంతరం ఫిర్యాదు నమోదైందా? లేదా? అనే విషయంలో పెద్దగా దృష్టి పెట్టరు. వీటన్నింటిని నివారించేందుకు పోలీసులు ఫిర్యాదుదారుడికి తన కేసు గురించి తెలియజేసేందుకు ఎఫ్ఐఆర్ పత్రాలను అందజేస్తున్నారు. ఫిర్యాదుదారుడి వాంగ్మూలం తీసుకున్న అనంతరం దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు కోర్టులో ఉన్న పెండింగ్ కేసుల్లో బాధితులకు ఎంత వరకు న్యాయం జరుగుతుందనే విషయంపై కూడా దృష్టి సారిస్తున్నారు.



ఎఫ్ఐఆర్ కాపీని ఫిర్యాదుదారుడికి అందజేస్తున్న బంజారాహిల్స్ ఎస్ఐ(ఫైల్)

ఇక కొన్ని కేసుల్లో రాజీ కోసం వచ్చే ఇరుపార్టీలను లోక్‌అదాలత్‌లో ప్రవేశపెట్టి సహకరిస్తున్నారు.

సివిల్ కేసుల్లో..

బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ లాంటి పోలీసుస్టేషన్ల పరిధిలో స్థల వివాదాలు అనేకం. పోలీసుల ద్వారా కేసులు నమోదు చేయించి లబ్ధిపొందేందుకు అనేక మంది ప్రయత్నాలు చేస్తుంటారు. ఇలాంటి సివిల్ వివాదాల్లో తలదూర్చకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సివిల్ వ్యవహారాల్లో కేసులు నమోదు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ వివాదం ఉన్న స్థలంలో శాంతిభద్రతల సమస్య తలెత్తితే మాత్రం రెండు వర్గాలపై కేసులు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేస్తున్నారు. ఈ కేసులు కూడా నేరపూరిత అంశాల్లో వర్తించే సెక్షన్‌లు మాత్రమే నమోదు చేస్తున్నారు.

పౌరులు అనుమానాలను తొలగించుకోవాలి

చిన్న కేసుల విషయంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తారని అనుకుంటారు. చరవాణులు, వాహనాల చోరీ, ప్రమాదాల విషయంలో కేసులు నమోదు చేయరనే అపోహ ఉంటుంది. అలాంటి అనుమానాలు, అపోహలను తొలగించడంతోపాటు పోలీసులపై నమ్మకం పెంచేందుకు ఎఫ్ఐఆర్ పత్రాలను ఫిర్యాదుదారుడికి అందిస్తున్నాం. వీటిని నిజమైన నేరాల్లో మాత్రమే అందిస్తున్నాం. సివిల్ తగాదాలకు సంబంధించిన అంశాల్లో కొంత సంయమనం పాటిస్తున్నాం. ఎఫ్ఐఆర్ పత్రాలు ఇవ్వాలని చట్టంలో ఉంది. ఇంటికి వెళ్లి ఇవ్వాలని లేదు. వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదుదారుకు పత్రాలు పంపవచ్చు.

- సామల వెంకట్‌రెడ్డి, బంజారాహిల్స్ డివిజన్ ఏసీపీ



బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

తిరుమలగిరి మే 13 (ఆంధ్రజ్యోతి): బస్తీలో కమ్యూనిటీ హాల్ లేక నిరుపేదలు చిన్న ఫంక్షన్ చేసుకుందామన్న లక్షల్లో వెచ్చిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నామని బస్తీవాసులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. బస్తీబాటలో భాగంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ పెద్ద కమేలలో మంగళవారం సాయంత్రం పర్యటించి, స్థానికుల ద్వారా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ హాల్‌ను మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌గా నిర్మించి అందుబాటులోకి తేవాలని తెలిపారు. అలాగే రేషన్ దుకాణం అందుబాటులో లేక తిరుమలగిరి వెళ్లాల్సి వస్తుందని, విద్యుత్ స్తంభాలు లేక కాలనీలోని కొన్ని ప్రాంతాలు చీకట్లో ఉన్నాయని తెలిపారు. కాలనీలో మంచినీటి సరఫరా లేక అవస్థలు పడుతున్నామని, అంగన్‌వాడీ సెంటర్ లేక గర్భిణీలు చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలనీలో నెలకొన్న డ్రైనేజి సమస్య పరిష్కారానికి కంటోన్మెంటు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు నాగనేని సరిత, మురళీ ముదిరాజ్, ఎం కృష్ణ, అశోక్, మధు, రాజేష్, కిరణ్ కుమార్, పి వాసు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల అందజేత

మారేడుపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఆడబిడ్డలకు లబ్ధి చేకూర్చే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం వెస్ట్ మారేడుపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 9 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి 4, షాదీ ముబారక్ 5 ఆర్థిక సహాయ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి ఆడబిడ్డల పెండ్లి ఆర్థికంగా ఎంతో భారమన్నారు. వారికి కొంత అండగా ఉండాలనే ఆలోచనతోనే గత ప్రభుత్వంలో కేసీఆర్ ఈ కార్యక్రమం ప్రారంభించారని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ శేషు కుమారి, రెవెన్యూ అధికారి సురేష్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, సంతోష్ కుమార్, శ్రీహరి, నరేందర్, శేఖర్, ఆరీఫ్, గోపీలాల్ చౌహాన్, కూతురు నర్సింహ, బలరాం, హరిసింగ్ పాల్గొన్నారు.



యూట్యూబ్ విలేకరులపై తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేసిన జై భీమ్ మాల మహాసంఘం ప్రతినిధులు

యూట్యూబ్ చానల్స్‌పై ఫిర్యాదు

అడ్డగుట్ట మే 13 (ఆంధ్రజ్యోతి) : అసలే మురికివాడ, గుడిసెలు, చిన్న ఇళ్లు కట్టుకుంటే చాలు యూట్యూబ్ చానల్స్ విలేకరులు వాలిపోతున్నారు. బోరింగ్ వేస్తే చాలు వారు అడిగింది ఇవ్వాల్సిందే. లేదంటే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఇంటి యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జై భీమ్ మాల మహాసంఘం ప్రతినిధులు మంగళవారం తుకారాంగేట్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం ముఖ్య సలహాదారుడు నక్కా మధు, అధ్యక్షుడు ఆర్ మల్లేష్‌లు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుకారాంగేట్ అడ్డగుట్ట సాయినగర్, మహేంద్రాహిల్స్ ప్రాంతాల్లో యూట్యూబ్ ఛానళ్ల విలేకరులమని చెప్పుకుంటూ ప్రజలను పీక్కుతింటున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో సంఘం నాయకులు శివకుమార్, రమేష్ బాబు, నక్కా రాజు, రవి, అమర్, కోటేశ్వర్‌రావు, లక్ష్మిప్రసన్న, మహేందర్, రమాదేవి, రామలీల, హరి, శ్రవణ్, హరి, రాములు ఉన్నారు.



పేదలకు భోజనం

పీస్ట్ సందర్భంగా సికింద్రాబాద్ సెయింట్ సెబాస్టియన్ చాపెల్ వద్ద పేదలకు భోజనం పంపిణీ చేశారు. నిర్వాహకులు శ్యామ్, జాని, ప్రవీణ్, రమేష్, మోసెస్, దాసు, అనిల్, గౌరిశంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- (రెజిమెంటల్‌బజార్, ఆంధ్రజ్యోతి)



పుట్టినరోజు శుభాకాంక్షలు

బీఆర్ఎస్ యువనేత తలసాని సాయి కిరణ్ యాదవ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న సోమాజిగూడ మాజీ కార్పొరేటర్ ఎలిగల మహేష్ యాదవ్ తదితరులు.

- బేగంపేట, (ఆంధ్రజ్యోతి)



నివాళులు

బీజేపీ సీనియర్ నాయకుడు అంపాల పద్మారెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందడంతో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి నాచారంలోని అంపాల పద్మారెడ్డి నివాసంలో ఆయన పార్థీవ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి

నిరుపయోగంగా ఆరోగ్య ఉపకేంద్రం

- బయటనే ఆరోగ్య పరీక్షలు

బోయినపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి) : అతి పెద్ద కూరగాయల మార్కెట్ యార్డుగా పేరుగాంచిన బోయినపల్లి మార్కెట్ యార్డ్‌లో సిబ్బంది, హమాలీలు, డ్రైవర్లు, వ్యాపారస్తులతో పాటు స్థానికుల ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని లక్షలు వెచ్చించి ప్రభుత్వం నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం ప్రస్తుతం నిరుపయోగంగా వుంది. కొన్ని నెలలుగా అది వ్యాపారస్తులకు పార్కింగ్ అడ్డాగా మారింది. మార్కెట్ యార్డులో ఆరోగ్య ఉపకేంద్రం ఉంటే అత్యవసర సమయాల్లో మార్కెట్ యార్డ్‌కు వచ్చిపోయే వ్యాపారస్తులకు, రైతులకు, కూలీలకు వారి కుటుంబ సభ్యులకు ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. ముఖ్యంగా వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూరగాయాలను తీసుకు వచ్చే రైతులకు, డ్రైవర్లకు ఈ కేంద్రం అత్యవసర సమయాల్లో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే ఈ ఆర్యోగ ఉపకేంద్రం ప్రస్తుతం నిరుపయోగంగా ఉండటంతో ఏవైనా ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు సంభవిస్తే కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత పాలకులు ఈ ఆరోగ్య ఉపకేంద్రంపై దృష్టి సారించి ప్రజారోగ్యాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

- బోయినపల్లి మార్కెట్ యార్డ్‌లో వ్యాపారస్తులకు, రైతులకు, కూలీలకు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందకు హెల్త్ సెంటర్ లేకపోవడంతో సూపర్‌వైజర్ మార్కెట్ యార్డ్‌లో నిరుపయోగంగా ఉన్న సెక్యూరిటీ గది బయట చెట్టు కింద ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లేబర్ కార్డు ఉన్న దాదాపు పది మందికి చెట్టు కిందనే ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు.



చెట్టు కింద పరీక్షలు చేస్తున్న హెల్త్ సూపర్ వైజర్



మార్కెట్ యార్డులోని హెల్త్ సెంటర్

అందుబాటులోకి తీసుకువస్తాం



మార్కెట్ యార్డ్‌లోని హెల్త్ సెంటర్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, సేవలు అందించడానికి కృషి చేస్తాం. ఇక్కడ పని చేసే రైతులు, హమాలీలు, వాపారస్తుల ఆరోగ్య రక్షణ కోసం హెల్త్ సెంటర్ ను అందుబాటులోకి తీసుకువస్తాం. ఈ విషయమై మార్కెటింగ్ శాఖ మంత్రి ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్లు తెలిపారు.

- ఆనంద్ బాబు, చైర్మన్

ఎంపీ ఈటల క్షమాపణలు చెప్పాలి

- ఓయూ విద్యార్థి, యువజన సంఘం నాయకులు వెంకట్

తార్నాక, మే 13 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్పాలని ఓయూ విద్యార్థి, యువజన సంఘం నాయకులు గాదె వెంకట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తార్నాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంపీ ఈటల తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం సీఎంపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మరోసారి ఈటల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు హరినాథ్, గోపాల్ దాస్, డా. జిల్లాపల్లి నాగేశ్వరరావు, దూడపాక సురేష్, కంపాటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, శ్రీపతి సతీష్

సనత్‌నగర్‌లో టీడీపీకి పూర్వవైభవం

బేగంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన అన్నారు. టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి సతీష్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం తులసీనగర్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అన్ని డివిజన్లకు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారు. సనత్‌నగర్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మల్లేష్, బి.శ్రీనివాసులు, అమీర్‌పేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.కృష్ణ, ఎం.అరుణ్, బేగంపేట అధ్యక్షుడిగా రవిబాబు, రాంగోపాల్‌పేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.రామ్మోహన్‌నాయుడు, బి.సురేష్, బన్సీలాల్‌పేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.సందీప్, కె.చంద్రకళను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రసూన మాట్లాడుతూ త్వరలోనే పూర్తిస్థాయి కమిటీలను నియమించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ పరిశీలకులు నల్లెల కిశోర్, శ్యామ్, నాయకులు కానూరి జయశ్రీ, రాజేంద్రప్రసాద్, ఎం.రాజు, యాదగిరి, మహేందర్ పాల్గొన్నారు.

గణేశ్ టెంపుల్ చౌరస్తాలో.. సివరేజీ మ్యాన్‌హోల్ ధ్వంసం

- రోడ్డుపైకి మురుగునీరు
- అధికారులకు ఫిర్యాదు
- వెంటనే మ్యాన్‌హోల్ నిర్మాణం

బేగంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని శ్యామ్‌లాల్ బిల్డింగ్ పరిధి గణేశ్ టెంపుల్ చౌరస్తాలో కొంతకాలంగా నిత్యం సివరేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో నిత్యం వాహనదారులు తీవ్ర అవస్థలు పడేవారు. ఇక్కడ ఉన్న మ్యాన్‌హోళ్లలో ఒకటి పూర్తిగా ధ్వంసమవడంతో ఎగువ నుంచి వచ్చే మురుగునీరు ఇక్కడ రహదారిపై నిలుస్తోంది. స్థానికంగా నెలకొన్న సమస్యను ప్రజలు ప్రకాశ్‌నగర్ వాటర్‌వర్క్స్ సెక్షన్ మేనేజర్ రామేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం తన సిబ్బందితో అక్కడకు చేరుకుని మ్యాన్‌హోల్ పనులను నిర్వహించారు. పూర్తిగా ధ్వంసమైన మ్యాన్‌హోల్ స్థానంలో నూతన మ్యాన్‌హోల్‌ను నిర్మించారు. ఈ పనులను మేనేజర్ రామేశ్వరరావు దగ్గర ఉండి పూర్తి చేయించారు. దీంతో గణేశ్ టెంపుల్ చౌరస్తాలో ఏర్పడిన మురుగు సమస్యకు తెరపడింది.



డ్రైనేజీ మ్యాన్‌హోల్ పనులు చేయిస్తున్న అధికారులు

వెయిట్ లిఫ్టింగ్ ఆణిముత్యం

- ఖేలో ఇండియా శిబిరంలో సాయివర్ధన్ కీర్తి పతాకం

మారేడుపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి) : బీహార్‌లో జరుగుతున్న ఖేలో ఇండియా శిబిరంలో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న తెలంగాణ యువ క్రీడాకారుడు జె.సాయివర్ధన్ ఆకర్షణగా నిలిచాడు. ప్రఖ్యాత కోచ్ విజయ్ రోయిలా వద్ద శిక్షణ పొందుతున్న 17 ఏళ్ల సాయివర్ధన్ 89 కిలోల విభాగంలో స్వర్ణపతకాన్ని గెలుచుకొని ప్రతిభను చాటాడు. అతడి విజయంతో తెలంగాణకే గర్వకారణమే కాకుండా దేశంలో యువ క్రీడాకారుల సామర్థ్యాన్ని ప్రపంచానికి తెలియజేసింది. యువతకు క్రీడాస్ఫూర్తిని పెంపొందించడానికి కేంద్రం ప్రారంభించిన ఖేలో ఇండియా కార్యక్రమం యువ క్రీడాకారులకు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి అద్భుతమైన వేదికగా నిలుస్తుంది. ఔరంగాబాద్ శిబిరం వంటి కేంద్రాలు యువ క్రీడాకారులకు ప్రొఫెషనల్ శిక్షణను అందిస్తూ వారు జాతీయ స్థాయిలో మెరుపులు మెరిపించేందుకు మద్దతుగా నిలుస్తున్నాయి.



ఖేల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన సాయివర్ధన్

తెలంగాణ రత్న పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాంనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం (జూన్ 2) పురస్కరించుకుని ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో తెలంగాణ రత్న పురస్కారాలు- 2025 ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ ఈఎస్‌ఎ.నారాయణ మాష్టార్ తెలిపారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాలలో మట్టిలో మాణిక్యంగా ఉన్నకవులు, రచయితలు, సంగీతం, నృత్యం, రంగస్థల కళాకారులు, ఉపాధ్యాయులు, వైద్యులు, విద్యావంతులు, సామాజిక సేవకులు, ఆధ్యాత్మికం, క్రీడలు, యోగా గురువులు, కార్మికులు, కర్షకులు, క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారికి తెలంగాణ రత్న, తెలంగాణ కీర్తి, ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 25వ తేదీలోపు సంస్థ కార్యాలయం గోకుల్‌నగర్, 1-20-164, తిరుమలగిరి, సికింద్రాబాద్‌కు పంపించాలని, వివరాలకు 9652347207లో సంప్రదించాలని కోరారు.

కన్నతల్లిపై కుమారుడు దాడి

బేగంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన కుమారుడు కన్నతల్లిపై రాడ్డుతో దాడి చేసి గాయపరిచాడు. ఈ సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతినగర్‌లోని హరినగర్‌లో నివసిస్తున్న నర్సింహులు, కమలమ్మ దంపతులకు రాము, లక్ష్మణ్ కుమారులు ఉన్నారు. కమలమ్మ హౌస్ కీపింగ్ పనులు చేస్తుంది. మద్యానికి బానిసైన పెద్ద కుమారుడు రాము తరచూ డబ్బులు ఇవ్వమని తల్లిని వేధించేవాడు. ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు కమలమ్మ ఇంట్లో ఉండగా రాము అక్కడికి వచ్చి తల్లితో గొడవపడ్డాడు. డబ్బులు ఇవ్వాలని వాగ్వాదానికి దిగాడు. ఆవేశంలో రాడ్డుతో తల్లిపై దాడి చేశాడు. అడ్డుకోవడానికి వచ్చిన లక్ష్మణ్‌పై కూడా దాడి చేశాడు. దీంతో కమలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వెంకటాద్రినగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మర్రి

మల్కాజ్‌గిరి అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

మల్కాజ్‌గిరి, మే 13 (ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి సమగ్రాభివృద్ధికి ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన గౌతంనగర్ డివిజన్ పరిధిలోని వెంకటాద్రి నగర్‌లో కార్పొరేటర్ సునీతారాముయాదవ్‌తో కలిసి పర్యటించారు. మిర్జాలగూడ చిన్మయమార్గ్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరదముంపునకు గురవుతున్న చిన్మయమార్గ్‌కు సజావుగా వరదనీరు వెళ్లేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పార్కు స్థలంలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. హన్మాన్‌పేట్‌లోని రైల్వేలైన్ కిందినుంచి కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ వెంట్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏసీపీ శ్రీనివాస్, డీఈ లౌక్య, ఏఈ దివ్య జ్యోతి, నాయకులు జేపీసీ వెంకన్న, రాముయాదవ్, పార్టీనాయకులు పాల్గొన్నారు.



ఎంపీ ఈటలను కలిసి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సునీతశేఖర్ యాదవ్

ఎంపీ నిధుల నుంచి పవర్‌బోర్లు ఏర్పాటు చేయాలి

- కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్

మల్కాజ్‌గిరి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎంపీ నిధుల నుంచి మౌలాలి డివిజన్‌లో పవర్‌బోర్లు వేయించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ వినతిపత్రం అందజేశారు. నెహ్రూనగర్, గోకుల్‌నగర్, షఫీనగర్‌లో పవర్‌బోర్లు వేయించాలని కోరారు. కాగా డివిజన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శివగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

యాదవులు ఐక్యంగా హక్కులను సాధించుకోవాలి

ముషీరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత యాదవ మహాసభ జాతీయ చీఫ్ ప్యాటన్‌గా బద్దుల బాబూరావు యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం అఖిల భారత యాదవ మహాసభ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో బాబూరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీందర్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎడ్ల హరిబాబు యాదవ్ ఘనంగా సన్మానించారు. అనంతరం బద్దుల బాబూరావు యాదవ్ మాట్లాడుతూ... యాదవలంతా ఐక్యంగా ఉన్నప్పుడే తమ న్యాయమైన హక్కులను సాధించుకోవచ్చన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో యాదవులకు సముచిత స్థానం కల్పించేలా రాజకీయాలకు అతీతంగా ఐక్య పోరాటాలు చేయాలన్నారు. త్వరలో అఖిల భారత యాదవ మహాసభ పూర్తిస్థాయి కమిటీలను ప్రకటిస్తామని తెలిపారు.



బాబూరావు యాదవ్‌ను, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న హరిబాబు యాదవ్

క్రైమ్ కార్నర్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అదృశ్యం



షరీఫ్ (ఫైల్)

బోయినపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి) : భార్యతో గొడవ పడిన భర్త భార్య ఇంటికి వచ్చే లోపు ఇంటిలో ఉన్న భార్య వస్తువులతో కనిపించకుండా పోయిన సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం బోయినపల్లి చిన్నతోకట్టకు చెందిన ఆశాది సబితా భర్త చనిపోవడంతో ఇదే ప్రాంతానికి చెందిన ఎండీ షరీఫ్‌తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో సబితా, ఎండీ షరీఫ్ వివాహం చేసుకున్నారు. వీరి వివాహం ఇరు కుటుంబాలకు ఇష్టం లేకపోవడంతో బోయినపల్లి చిన్నతోకట్టలో ఉంటున్నారు. ఇంటి తాళాల విషయంలో ఇరువురి మధ్య చిన్న వాదన జరిగిందని, మూడు రోజుల క్రితం ఎండీ షరీఫ్ భార్యను తాను పని చేసే హల్దిరామ్స్ షాప్ దగ్గర దింపి వెళ్శాడు. మధ్యాహ్నం 12:30 గంటలకు ఇంటికి తిరిగి వచ్చే సరికి తన భర్త బట్టలు, అతడి వస్తువులు, ఆమె వెండి పట్టీలతో పాటు, నెల జీతం రూ.12 వేలు కనిపించకుండా పోయాయని, భార్య గ్రహించింది. అన్నిచోట్ల వెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో మూడు రోజులుగా వేచి చూసిన భార్య బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఓల్డ్ బోయినపల్లిలో యువతి..



కృష్ణమ్మ (ఫైల్)

ఓల్డ్ బోయినపల్లికి చెందిన మానసికస్థితి సరిగా లేని ఏటిగడ్డ కృష్ణమ్మ అనే మహిళ అదృశ్యమైన సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం ఓల్డ్ బోయినపల్లిలోని అబ్బాస్ రెసిడెన్సీలో వాచ్‌మన్‌గా పని చేస్తున్న ఏటిగడ్డ మణియం సోదరికి మతిస్థిమితం సరిగ్గా లేదు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్ళిన ఆమె తిరిగి రాలేదు. తిరిగి వస్తుందని ఎదురుచూసిన కుటుంబసభ్యులు, ఆమె రాకపోవడంతో తెలిసినవారు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

భార్యతో గొడవపడి వ్యక్తి..



చాంద్‌పాషా (ఫైల్)

రాంగోపాల్‌పేట్, మే 13 (ఆంధ్రజ్యోతి) : భార్యతో గొడవ పడి బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన లేక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రాణిగంజ్ టీ 19 టవర్స్ సమీపంలో నివసించే రుక్సానా బేగం, షేక్ చాంద్‌పాషా (43)లు దంపతులు. అదే ప్రాంతంలో టీ స్టాల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా వివిధ కారణాల వల్ల ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. గొడవలు జరిగినప్పుడల్లా చాంద్ పాషా బయటకు వెళ్లి తర్వాత తిరిగి వచ్చేవాడు. ఈ క్రమంలో గత నెల 25న టీ స్టాల్ వద్ద ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన చాంద్ పాషా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అప్పటినుంచి చాంద్ పాషా తిరిగి రాకపోవడంతో అతడి కోసం పలు ప్రాంతాల్లో వెతికినా రుక్సానా బేగంకు చాంద్ పాషాకి సంబంధించి ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం లేక్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా చాంద్ పాషా ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎసై కిరణ్ కుమార్ కోరారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న డా. చిన్నారెడ్డి

ప్రజావాణికి 287 దరఖాస్తులు

బేగంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీ.ఎం ప్రజావాణికి మొత్తం 287 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించడంతో పాటు వారి సమస్యలు తెలుసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి 94, విద్యుత్ శాఖకు 22, రెవెన్యూకు 61, మున్సిపల్‌కు 18, ప్రవాసీ ప్రజావాణికి 2, ఇందిరమ్మ ఇళ్లకు 50, ఇతర శాఖలకు సంబంధించి 40 దరఖాస్తులు వచ్చినట్లు అధికారి తెలిపారు.